
# భారతీయం

## – సరస్వతి కరవది



## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

35

శయనమ్మగారు పోయినప్పుడు వచ్చి మూడు రోజులు ఉండి వెళ్లిపోయిన రాజేశ్వరి మళ్ళీ ఆవిడ పదో రోజు కార్యక్రమాలకి వచ్చింది. ఇంట్లో వాళ్ళందరూ ఇంకా దుఖంలోనే ఉన్నారు. అక్కను చూసి ప్రాణం లేచి వచ్చింది భారతికి. ఆత్మీయంగా రాజేశ్వరి చెయ్యి పట్టుకుని

"బావ రాలేదా అక్కా?" అని అడిగింది.

"ఎక్కడ? కొట్టు చూసుకోవాలిగా. నాకే కుదరట్లేదు... రోజూ వద్దామనుకుంటున్నా అనుకుంటున్నా" అంది రాజేశ్వరి. హైమవతి, శారదమ్మలు కూడా పలకరించారు రాజేశ్వరిని.

"ఒంట్లో ఎట్లా ఉంటోందమ్మా?" కింద కూర్చోబోయిన రాజేశ్వరిని వారించి కుర్చీ చూపిస్తూ అడిగింది హైమవతి. శారదమ్మ ఆ రోజే తాను చేసిన కారప్పూస, వెన్న ఉండలు ఒక పళ్లెంలో పెట్టి తెచ్చి ఇచ్చింది రాజేశ్వరికి. ఆ పళ్లెం అందుకుంటూ అంది రాజేశ్వరి

"బాగానే ఉంటోందమ్మా, కొంచెం నీరసం తప్ప."

వారు మాట్లాడుకుంటుండగానే శయనమ్మ గారి పెద్ద ఫోటోలు రెండు ఇద్దరు జీతగాళ్ళు తీసుకువచ్చి

"అమ్మా ఇవి ఎక్కడ పెట్టాలి?" అని అడిగారు భారతిని. ఆ ఫొటోల్లో నవ్వుతూ ఉన్న శయనమ్మను చూడగానే అందరికీ కళ్ళ వెంట నీళ్లు తిరిగాయి. ఆవిడ కసలు విడిగా ఫోటోనే లేదు. భారతి పెళ్ళి అవగానే అందరూ కొత్త దంపతులతో సహా స్టూడియోకి వెళ్లారు ఫోటోలు తీయించుకోవడానికి. అప్పుడు కొత్త దంపతుల బలవంతం మీద వాళ్ళిద్దరినీ చెరో వైపు నిల్చో పెట్టుకుని అయితే ఫోటో దిగటానికి శయనమ్మగారు ఒప్పుకున్నారు. కాదు, కాదు హైమవతి, శారద ఒప్పించారు. ఆ ఫొటోలో అటూ,ఇటూ ఉన్న వాళ్ళిద్దరినీ తొలగించి, ఆమె ఒక్కదాన్నే ఉంచి వీలైనంత పెద్ద ఫోటో చేశాడు స్టూడియో అతను. మరొకటి సుశీలతో ఉన్నది కానీ దాన్లో సుశీల ఆమె భుజాల మీద చేతులు వేసి ఉన్నది. అందువల్ల అది తీయించలేదు. సుశీల అన్ని ఫోటోలను తీసేస్తున్నప్పుడు భారతి ఆ ఫోటోను దాచగలిగింది ఆమె కంటపడకుండా. అరవయ్యేళ్లకు పైగా బ్రతికిన ఆమెకు జీవితం మొత్తం మీద ఉన్నవి ఆ రెండు ఫొటోలే అంటే ఎంత ఆశ్చర్యం!

"వరండా లో నుంచి రాగానే ఎదురుగా కనిపించేట్టు పెట్టండి" అంది భారతి. ఆమోదించినట్లు ఊరుకున్నారు హైమవతి, శారదమ్మ. రాజేశ్వరి మొహం ముడుచుకుంది.

"ఇంట్లోకి రాగానే ఆవిడ ఫోటో ఎందుకు? ఏదో పెద్ద ముత్తైదువయినట్టు?" అన్నది. శారదమ్మ మొహం నల్లబడింది. రాజేశ్వరి రాగానే, ఆమె మీద ప్రేమ కొద్దీ శారదమ్మ ముందుగా వెళ్ళి ఆహ్వానిస్తుంది. ముడుచుకు పోయిన అత్తయ్య మొహం చూడగానే భారతి తీక్షణంగా చూసింది రాజేశ్వరి వైపు. హైమవతి వెంటనే

"రాజేశ్వరి, ఏమిటా మాటలు? రెండో బిడ్డకు తల్లివవుతున్నా ఇంకా చిన్నతనం పోలేదు నీకు" అంది మందలింపుగా. రాజేశ్వరి మనసులోనే నాలుక కరుచుకుంది.

"బావుంది, నేనేమన్నాననీ? ఇంటికొచ్చిన వాళ్లెవరన్నా అంటారేమోననీ. ఎవరి అభ్యంతరాలు వాళ్ళకి ఉండొచ్చుగా !"అంది సాగదీస్తూ. ఎంత కాదన్నా అత్తగారి సాగతీతలు అలవాటయ్యాయి రాజేశ్వరికి.

"ముందర్నించీ ఈ ఇంట్లో ఆ పిచ్చి అలవాట్లు, అభ్యంతరాలు లేవు కదా అక్కయ్యా. అలాంటివే ఉంటే, ఇంకా చాలా వాటికి ఉండాలి." అంది భారతి కొంచెం కటువుగానే. అర్థం గ్రహించుకున్న రాజేశ్వరి మొహం మాడ్చుకుంది. శారదమ్మ అక్కడ నిలవలేక

"ఎసరు పడెయ్యాలి. చీకటి పడుతోంది." అంటూ తన ఇంటికి వెళ్ళిపోయింది.

"ఇట్లాటి చాదస్తపు మాటలు ఎక్కడ నేర్చావే?" అని విసుక్కుంది హైమవతి.

"బాగుంది, అక్కడికి మీకే ముసలమ్మ గారి మీద ప్రేమ తెగ కారిపోతున్నట్లు. నాకు లేదు మరి." మొండిగా అన్నది రాజేశ్వరి. ఆ భాషకి మొహాలు మొహాలు చూసుకున్నారు హైమవతి, భారతి. ఘాటుగా ఏదో జవాబివ్వబోయి వీధి గేటు తెరుచుకుని వస్తున్న నాగరాజుని చూసి ఆగిపోయింది భారతి. హైమవతి అల్లుడిని చూసి మంచినీళ్ళు తెద్దామని లోపలకు వెళ్ళింది. ఇప్పుడామెకు పెద్దఅల్లుడు, కూతురు అత్యంత ఆత్మీయులయ్యారు.

"అరె, బావ! ఏం బావా? బాగుందా వ్యాపారం? ఇటుకేసి తొంగిచూడటం కూడా మానేశావు" ఆపేక్షగా పలకరించింది.

"బ్రహ్మాండంగా ఉంది. ఈ నెల అమ్మకాలు...." నాగరాజు నవ్వుతూ ఏదో చెప్పబోతుండగా అడ్డుపడింది రాజేశ్వరి కంగారుగా.

".. ఔను మీరు కొట్టు దగ్గిర ఉన్నారుగా, ఎప్పుడొచ్చారు ఇంటికి?" నాగరాజు తెల్లమొహం వేశాడు ఆ ప్రశ్నకి. భార్య కళ్ళతో చేస్తున్న సైగ అతనికి అర్ధం కాలేదు. భారతికి బాగానే అర్థమయ్యింది.

"నేను కొట్టు దగ్గరలేనుకదా. టోకు దుకాణంలో సరుకులు కొని మన కొట్టుకి పంపించి, పెందలాడే ఇంటికి వస్తానని కబురు పంపా కదా, " బిత్తరపోతూ అడిగాడు.

"ఔనా, ఆ వెధవ అట్లా చెప్పాడేంటి మరీ?" సాగదీసింది రాజేశ్వరి.

"ఏ వెధవ రాణీ ? ఏం చెప్పాడు?" భారతికి నాగరాజుని చూసి జాలేసింది.

"మీ ఇద్దరూ తేల్చుకోండి బావా. ఈ లోగా నేను కారప్పూసా, వెన్నుండలూ తెస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది.

“ఏవిటిలా చెప్పాపెట్టకుండా వచ్చేసావు? చెప్తే నేనూ వచ్చేవాడినిగా." అన్నాడు నాగరాజు

"మీ తెలివితేటలు తెల్లారా ! నేను సైగ చేస్తున్నా కదా, అసలు నన్ను పట్టించుకోరే? మనం కొట్టు మీద ఎంత సంపాదిస్తున్నామో వీళ్ళ కెందుకు చెప్పటం?." విసుగ్గా అంది రాజేశ్వరి.

పక్కగదిలోంచి తలదువ్వుకుంటూ వచ్చాడు మురారి, "ఏం బావా, మా అక్క సైగలింకా అర్ధం కాకపోతే ఎట్లా?" అంటూ. కన్నంలో వేలు పెట్టిన దొంగలా మాటలు మానేసి ఓ నవ్వు నవ్వింది రాజేశ్వరి. ఇంతలో ఫలహారాలు, మంచినీళ్ళు ఒక పళ్లెంలో పెట్టుకుని తెచ్చింది భారతి నాగరాజు కోసం.

ఈ లోగా శయనమ్మగారి ఫోటోని మేకులు కొట్టి గోడకి అమర్చారు జీతగాళ్ళు. ఆ ఫోటో వైపు చూసి అప్రయత్నంగా చేతులు జోడించాడు నాగరాజు.

"బాగుంది, మంచి చోట పెట్టారు పెద్దావిడ ఫోటో. రాగానే దణ్ణం పెట్టుకునేందుకు వీలుగా" అన్నాడు. మురారి, భారతి మొహాలు చూసుకున్నారు.

"అమ్మా,రెండో ఫోటో ఎక్కడ పెట్టాలి?"

"పదండి. అది ‘అందరిల్లు’ లో పెట్టాలి. లోపలకు రాగానే ఆఫీస్ రూమ్ ఉంది కదా. దానిలో ఎదురు గోడకు. నేనూ వస్తున్నా" బయలు దేరింది భారతి.

"ఉండవే నేనూ వస్తా. మీ ఫలహారం కానివ్వండి. ఒకసారి అటు వెళ్ళివస్తాం. చూసి చాలా రోజులయ్యింది." భర్తతో అంటూ భారతిని అనుసరించింది రాజేశ్వరి. భారతి కొంచెం ఆశ్చర్య పోయినా ఏమీ అనకుండా ముందు నడిచింది. ఆ రోజు వరకూ రాజేశ్వరి "అందరిల్లు" మీద పెద్దగా ఆసక్తి ఎప్పుడూ చూపించలేదు!

"అందరిల్లు"లో అడుగు పెట్టిన రాజేశ్వరి ఆశ్చర్యపోయింది. శయనమ్మ పోయినప్పుడు వచ్చినప్పటికీ, ఇప్పటికీ పోలిక లేదు. ఆవరణ అంతా పరుచుకుని ఉన్న చెత్త మొత్తం తొలిగించి వేయబడి ఉంది. ఆఖరికి వెనుకాల ఉన్న పశువుల పాక కూడా శుభ్రంగా ఉంది. ముందు ఆవరణలోని మొక్కలన్నీ శుభ్రంగా కళకళలాడుతున్నాయి. ఆశ్చర్య మేమిటంటే మనుషులు కూడా చాలా బాగున్నారు. శయనమ్మ పోయిన దుఃఖం వాళ్ళ మొహాల్లోనూ,మాటల్లోనూ ఉన్నదన్నది కాదనలేని సత్యం. అయితే వాళ్ళందరూ శుభ్రంగా, ఆరోగ్యంగా కనిపించారు రాజేశ్వరి కళ్ళకి. ఒక్క పదిరోజులలో ఇంత మార్పు ఎలా సాధ్యం? కొంపదీసి సుశీల తిరిగి వచ్చేసిందా?

"ఏమే భారతీ, సుశీల గానీ తిరిగి వచ్చేసిందేవిటే?" ఆరాగా అడిగింది భారతిని కుతూహలం ఆపుకోలేక.

"సుశీల పిన్నా,ఎక్కడుందో కూడా తెలియదు కదా..." జవాబిచ్చింది భారతి రాజేశ్వరి వైపు చూడకుండానే, జీతగాళ్ళు గోడకు పెడుతున్న ఫోటో సరిగ్గా పెడుతున్నారా లేదా అని చూస్తూ. భారతి ఒక్కసారి రాజేశ్వరిని చూస్తే ఆమె మొహంలో మారే భావాలు అర్థమై ఉండేవి.

అన్నిగదులూ కలియ తిరిగింది రాజేశ్వరి.

"అబ్బో, చాలా సామానే పోగేసింది ముసలమ్మ. ఇవన్నీ ఖాళీ చెయ్యటం ఎంత కష్టం?"

భారతి ఆశ్చర్యంగా అంది

"ఖాళీ చెయ్యటమా, దేనికి?

"దేనికేమిటే పిచ్చి మొహమా! ఇంకా దీన్ని ఎవరు నడిపిస్తారు? వీళ్లందరినీ ఎవరి దోవ వాళ్ళని చూసుకొమ్మని ఈ ఇల్లు అమ్మి పడేస్తే సరి."

"అమ్మి?" భారతి మొహం ఎరుపురంగుకీ తిరగటం రాజేశ్వరి గమనించలేదు.

"ముసలమ్మ గారికి పిల్లా పాపా? మనకేగదా వచ్చేది. ఎవరి వాటా వాళ్లకి పడేస్తే సరి." అంతకన్నా ఏంచేస్తారు అన్నట్లు అంది రాజేశ్వరి. రాజేశ్వరి ధోరణికి భారతి విస్తుబోయింది.

“అయిపోయిందమ్మా!” జీతగాళ్ళు పటాన్ని సరిగ్గా పెట్టి, బల్లని చంకలో పెట్టుకుని బయలుదేరారు.

“పదక్కా, బావ ఎదురు చూస్తుంటాడు.” అంది భారతి బయటకి దారితీస్తూ. ఆమెనుఅనుసరించింది రాజేశ్వరి మరొక్క సారి ఇల్లంతా కళ్ళతోనే కలయజూస్తూ

“మంచి చోట ఉందికదా! మంచి ధరే వస్తుంది.” అంది బయటకు నడుస్తూ. భారతి జవ్వాబు చెప్పలేదు. ఇంటికి వెళ్ళగానే రాజేశ్వరి వెనక్కి బయలుదేరింది భర్తతో కలిసి

“అమ్మా, నాన్నగారు వచ్చాక కబురు చెయ్యి. మాట్లాడవలసిన పని ఉంది వస్తాను. వస్తానత్తయ్యా. ” తల్లికీ, అత్తకీ చెప్పి బయల్దేరింది రాజేశ్వరి.

“జాగ్రత్తమ్మా” అన్నారు ఇద్దరూ.

“రాజూ ఎప్పుడొస్తావే ఇంకా? ఎప్పుడడిగినా చెప్పట్లేదు. ఏడోనెల కూడా ఇంకోవారంలో వెళ్ళిపోతుంది. నాన్నగారు రాగానే వచ్చి తీసుకురామా?"

“వచ్చేస్తే కొట్టు ఎట్లా అమ్మా? ఈయనకి ఏమీ తెలియదు. లెక్కలు సరిగ్గా చుసుకోలేరు.” అంది రాజేశ్వరి. "అయినా నాన్న వచ్చాక మాట్లాడటానికి వస్తా నన్నాగా.” అంటూ బయటకి వెళ్ళింది.

ఆ రాత్రి రవి వచ్చాక భారతి జరిగిందంతా చెప్పింది. రాజేశ్వరి మాటలు చెప్తూ చాలా నొచ్చుకుంది.

"అక్కయ్య అలా మాట్లాడిందేమిటి మావయ్యా? నేనసలు ఊహించలేదు." రవి నవ్వాడు.

"మనుషులందరూ ఒకేలా ఉండరు కదా. రాజేశ్వరి ముందరినుంచి కొంచెం మీ అందరిలోనూ వేరుగానే ఉంటుంది. పెళ్ళి అప్పుడు జరిగిన సంఘటనలతో మారింది అనుకున్నాను. కానీ స్వభావాలు మారవని నిరూపించింది."

"అదేమిటీ మావయ్యా? పెళ్ళికి ముందు ఎప్పుడూ అమ్మమ్మని అగౌరవంగా మాట్లాడలేదు. ఇవాళ దాని మాటలలో ఆవిడ మీద గౌరవం అస్సలు కనిపించలేదు. కానీ ఆవిడ ఆస్తి కావాలిట!"

"డబ్బు చాలా చెడ్డది భారతీ. మనుషుల్ని మార్చే శక్తి దానికి ఉంది. రాజేశ్వరి నీకు అక్క కనుక, తనకి నువ్వంటే చాలా ప్రేమ కనుక నీకు తన అసలు స్వభావం తెలిసి ఉండదు. కానీ మా ఇంట్లో మేమున్నా, మా తిండి మేము తింటున్నా ఆమె మమ్మల్ని లోకువగా చూసేది. వదినన్నా ఆమెకు చిన్న చూపే. బావకు అంటే మీ నాన్నకు కూడా తెలుసు ఈ విషయం." భారతి నివ్వెరబోయి వింటోంది.

"అందుకే వదిన రాజుని కోడలిగా చేసుకుందా మనుకున్నప్పుడు ఆయన ఏవో కారణాలు చూపించి ఆ పెళ్ళి మాటలు పడనియ్యలేదు. వదిన మెతక స్వభావానికీ, రాజేశ్వరి గడుసుతనానికీ కుదరదని. వదిన అప్పుడు చాలా బాధ పడింది కానీ ఇప్పుడు గ్రహించుకుంటోందిలే. సరళ వదిన ఎంతో మంచిది. ముందులో కొంచెం ఆమె మీద కోపం ఉన్నా, ఇప్పుడు వదినకి తనంటే చాలా ఇష్టం. అత్తయ్యకు రాజేశ్వరి అంటే అభిమానం ఎక్కువ. అందుకే మావయ్య ఈ విషయం ఆవిడతో కూడా చెప్పలేదు." భారతికి ఈ విషయాలేవీ తెలియవు. అందుకని ఆశ్చర్యంతో వింటోంది.

"మీ అన్నయ్యలు ఇద్దరూ, మావయ్యా మమ్మల్ని అంత బాగా చూసుకోబట్టి, అత్తయ్య ప్రేమతోటి మమ్మల్ని మీతో సమంగా పెంచబట్టి, మేము ఇక్కడ ఎటువంటి ఇబ్బందీ పడకుండా పెద్దయ్యాము. మావయ్య నిన్ను చేసుకోమని అడిగినప్పుడు కూడా నా మనసులో ఒక్క క్షణం నీ స్వభావం గురించి భయం మెదిలింది " భారతి మొహం కందిపోయింది అవమానంతో అయినా అతను ఏం చెప్తాడో వినాలని అనుకుంది,

"రాజులో అహం నీలో ఉందా అని అనుమానం. ఎందుకంటే తన దెబ్బకి నీతో కూడా మేము, ముఖ్యంగా నేను అస్సలు మాట్లాడేవాణ్ణి కాను.. కానీ మావయ్య అడిగినప్పుడు నీ మొహం వంక చూశాను నేను. అప్పుడు నువ్వూ నా వంక చూసావు. ఆ చూపులో నాకు నిర్మలత్వం తప్ప ఇంకేమీ కనిపించలేదు. అదృష్టవశాత్తూ నువ్వు నేను ఎలాంటి భార్యను కోరుకుంటానో అలాటిదానివే అయ్యావు."

ఒక్కసారిగా కరిగిపోయిన భారతి రవిని మరింత హత్తుకుని అతని నుదుటిపై ప్రేమగా చుంబించింది. స్వయంగా భర్త చెప్పినా రాజేశ్వరి స్వార్థపరురాలని, అహంభావి అనీ నమ్మటం భారతికి చాలా కష్టంగా ఉంది. అతని హృదయం మీద తలవాల్చి, అతను ముంగురులను సవరిస్తుండగా, పక్కనే ఉయ్యాలలో పడుకున్న బాబుని చూస్తూ అలాగే నిద్రలోకి జారిపోయింది నిమిషాల్లో.

"నీకు మరో విషయం చెప్పక తప్పదు భారతీ." కొంతసేపయ్యాక అన్నాడు రవి. కానీ భారతి నుంచి జవాబు రాక పోవటంతో ఆమె నిద్రపోతోందని గ్రహించి దీపం ఆర్పేసి తనూ నిద్రకి ఉపక్రమించాడు.

★★★★★

పనిమీద ఊరికి వెళ్ళిన పార్వతీశం తిరిగి మర్నాడు ఇంటికి వచ్చాడు. హైమవతి రాజు ఆయనతో మాట్లాడాలన్న విషయం చెప్పింది. పార్వతీశం భృకుటి ముడిపడింది. వెంటనే రాజేశ్వరికి కబురు చేసాడు. కూడా నాగరాజుని తీసుకుని మరీ రమ్మన్నాడు.

రాజేశ్వరి రావటమే ధుమధుమలాడుతూ వచ్చింది. ఆమెకు భర్త ముందు కొన్ని విషయాలు మాట్లాడటం ఇష్టం లేదు. పార్వతీశంకి పెళ్ళైన ఆడపిల్లలతో భర్త దగ్గర లేకుండా ఏ విషయమూ మాట్లాడటం ఇష్టం లేదు. అంత్యనిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలన్నది ఆయన సిద్ధాంతం.

పొద్దున్నే వచ్చారు రాజేశ్వరి వాళ్ళు. భోజనాలు అయ్యేవరకు స్థిమితంగా కూర్చున్నారు. బొత్తిగా గాలి ఆడక పోవటంతో అందరూ ముందు వరండాలో కూర్చుని తలా ఒక విసన కర్ర పట్టుకున్నారు. పార్వతీశం అందరితో అన్నాడు.

"ఇంక ఈ బాధ మనకి తప్పి పోతుంది లెండర్రా. త్వరలోనే మన ఇంటికి కరెంట్ వస్తుంది. అప్పుడు హాయిగా ఫాన్లు, లైట్లూ. స్విచ్ వేస్తే చాలు గాలే గాలి."

ముకుందం చాలా సంతోషించాడు.

"అయితే నాన్నా, ఇంక ఈ విసనకర్రలతో విసురుకునే అగత్యం ఉండదేమో."

"ఉండదురా, ఎప్పుడన్నా కరెంట్ పోతే తప్ప..

"ఏవండీ, నాకు వంటింట్లో ఫ్యాను పెట్టిస్తారా?" హైమవతి ధర్మసందేహం

"పొయ్యితో ప్రమాదమే. భోజనాల హాల్లో పెట్టిస్తాలే." ఓదార్చాడు పార్వతీశం.

“ఇంక ఈ కిరోసిన్ బుడ్లు, పెట్రోమాక్స్ లైట్లతో ఇబ్బందిపడమన్న మాట. చాలా బాగుంది.”మనస్ఫూర్తిగా అంది శారదమ్మ.

“అవునమ్మా, రాత్రిపూట పెరట్లోకి వెళ్ళటానికి భయపడ నక్కరలేదు. దొడ్లో కూడా దీపాలు పెట్టిస్తాను”. పార్వతీశం హామీ ఇచ్చాడు.

"అయితే మావయ్యా, మా వాడకి కూడా వస్తుందా?"నాగరాజు ఉత్సాహంగా అడిగాడు.

"వస్తుందండీ. కాకపోతే ముందు మనం కొంత డబ్బు కట్టి ఇంటికి వైర్ లాగించుకోవాలి. ఆ వివరాలన్నీ త్వరలోనే తెలుస్తాయిలే." చిన్న అల్లుడిని రవి అని పిలిచే ఆయన పెద్ద అల్లుడిని మటుకు మీరు అనే అంటాడు.

వాళ్ళ పెళ్ళైన కొత్తల్లో నాగరాజు గురించి అందరికీ ఎన్నో అనుమాలుండేవి. కానీ కొద్ది కాలానికే అతనికి చదువు తప్ప వేరే లోపమేవీ లేదని తెలిసిపోయింది. రాజేశ్వరి వాళ్ళ ఇంట్లో అడుగుపెట్టాక అతను ఆమెను గౌరవంగా చూసుకోవటం, ఆమె చెప్పినట్లు ఇంట్లో అన్నీ మార్చి వాడలో అందరికీ ఆదర్శంగా నిలవడం, తన కాళ్ళ మీద తాను

నిలబడటానికి లక్షణంగా ఒక వ్యాపారం పెట్టి, దాన్ని అభివృద్ధి పరచటం వంటివి అన్నీ ఇంట్లో అందరికీ నచ్చాయి. ముఖ్యంగా నాగరాజు వినయం, విధేయత పార్వతీశంకి, అతను లోపలికి ఎక్కువగా రాకపోవటం హైమవతికి, బాగా నచ్చాయి. ఎంత కాదనుకున్నా ఆమెలో ఛాందసత్వం ఇంకా మిగిలే ఉండనటానికి ఇదే ఉదాహరణ. అందరూ చాలా సేపు ఆ కరెంటు గురించే మాట్లాడుకున్నారు.

"ఇన్ని చెప్తున్నారు కదా, ఆ కరెంటు తగిలిస్తే మన రుబ్బురోలు తిరుగుతుందా? పిండి రుబ్బటం మహాకష్టంగా ఉంది." అంది హైమవతి.

ఫక్కున నవ్వాడు పార్వతీశం.

"ఓసి నీ ఇంట వాన కురవా! కరెంట్ నీకు పిండి రుబ్బి పెట్టటానికేమిటే? బాగుంది. ఏమో కొంత కాలంలో అలాంటి మిషన్లు కూడా వస్తాయేమో. గిన్నెలు కడిగేందుకూ, బట్టలు ఉతికేందుకూ..." హాస్యంగా అన్నాడు.

"ఏమో ఎందుకు రాకూడదు? ఇల్లు చిమ్మేటందుకు కూడా రావొచ్చు. ఏముందీ ఎవరో ఒకరు కనిపెట్టారా ఏమిటీ?" సాగదీసింది రాజేశ్వరి.

"అంతేలే, అయినా అన్నీ మీ ఆడవాళ్ళకి సంబంధించినవే చెప్తున్నారు. మగవాళ్ళకి ఏవీ రావా?" మురారి అడిగాడు.

"ఎందుకు రావూ? వస్తయ్యి. కానీ మగవాడి కోసం వచ్చిన వస్తువులు వాడు వాడినా సుఖపడేది మటుకూ ఆడవాళ్ళే " అంది రాజేశ్వరి. అందరూ ఫక్కున నవ్వారు. పార్వతీశం అప్పుడే గుర్తొచ్చి అడిగారు.

"ఏమ్మా రాజూ, నాతో ఏదో మాట్లాడాలని అన్నావుట? " రాజేశ్వరి ఇబ్బందిగా భర్తవైపు చూస్తూ అన్నది.

"అన్నాను. మీ అల్లుడుగారు తను మిమ్మల్ని అడగలేక నన్ను అడగమన్నారు."

"మరి అది ఏంటో చెప్పు." అనునయంగా అన్నాడు పార్వతీశం. ధైర్యం కూడగట్టుకుని అడిగింది రాజేశ్వరి.

"నాకు ఒక పదివేలు అవసరం నాన్నా." నాగరాజు బిత్తరపోయాడు రాజేశ్వరి గడుసుతనానికి. తనెక్కడ అడగమన్నాడు?

"పదివేలా?" అతను పార్వతీశం ఒకే సారి అన్నారు.

" అంత పెద్ద మొత్తం దేనికమ్మా?" పార్వతీశం అడిగాడు.

"నాకు అవసరం ఉంది నాన్నా. మా ఇంటిని డాబా ఇల్లు చేద్దామని, ఏమండీ మాట్లాడరేం?" నాగరాజుని చూస్తూ అంది రాజేశ్వరి.

"నేనెప్పుడు అన్నాను రాణీ "అనబోయాడు నాగరాజు. అంతలోకే ఆమె కళ్ళల్లోకి చూసిన అతనికి కర్తవ్యం బోధపడింది.

"అవునండీ" అన్నాడు తల దించుకుని.

అక్కడ ఎవ్వరూ మాట్లాడే సాహసం చెయ్యలేదు. పదివేలంటే చిన్న మొత్తమేమీ కాదు. అంతకు ముందు సంవత్సరమే పాకలను మార్చి పెంకుటిల్లు కట్టించుకున్నారు రాజేశ్వరి వాళ్ళు.

అంత సొమ్ము ఏ ధైర్యంతో అడుగుతోంది రాజేశ్వరి. రెండు నిమిషాలు గడిచాక పార్వతీశం అన్నాడు. "నా దగ్గర అంత డబ్బు సిద్ధంగా ఉండదు తల్లీ. తప్పదంటే పంటలొచ్చాక ఇస్తా. అయినా నీ పెళ్ళికి నేను ఖర్చు పెట్ట దలచిన సొమ్ము, నిన్ను కాపురానికి పంపేటప్పుడే ఇచ్చాను కదా."

"ఇవ్వలేదన్నానేంటీ. ఒక సారిస్తే ఇంకా ఇవ్వొద్దని ఎక్కడైనా ఉందా? చేతిలో డబ్బులుంటే ఆడపిల్లలకు పెట్టటంలో తప్పేముంది?" రాజేశ్వరి అన్నది కోపంగా.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS